అక్షౌహిణి

శ్రీ బి.వి. నరసింహారావు

హఠాత్తుగా వెనుక నుంచి కారు హారన్ వినిపించేసరికి ఖంగారుగా పక్కకు తప్పుకో బోయి వెనక్కుతిరిగాను. ఆ కారు నా పక్కగా వచ్చి ఆగిపోయింది. డ్రైవరు సీటులో వున్న 'ఖరీదైన మనిషి' "నమస్కారం మాస్టారూ" అని చిరునవ్వు నవ్వాడు.

ఒక్కనిముషం నాకంతా అయోమయ మయింది. నాలాంటివాడికి అటువంటి గొప్ప వ్యక్తులు తారస పడరు. నా ఆలోచనలకు వ్యవధి నివ్వకుండా ఆ కారులోని ఆసామి కిందకు దిగి "నన్ను గుర్తు పట్టలేదా మాస్టారూ!" అన్నాడు నమస్కరిస్తూ.

అతను బాగా పొడుగ్గా వున్నాడు. నల్లటి సూటు, నల్లటి అద్దాల కళ్లజోడు, తల మీద మార్వాడీలు పెట్టుకునే టోపీ—వీటి న్నింటితో చాలా దర్జాగా కన్పిస్తూన్న అత నెవరై వుంటాడో నాకు తోచలేదు. నా దగ్గర చదువుకున్న వాళ్లంతా నాకు బాగా గుర్తు లేకపోయినా కానీ, గుర్తున్న కొంత మందిలోనూ, ఎవరూ ఇతనంత ఉన్నతంగా లేరు.

ఆప్యాయంగా పలకరించిన అతనికి, "మీరెవరో నాకు జ్ఞాపకం లేదు" అని చెప్ప లేక అయోమయంగా అతని వేపు చూస్తుండి పోయాను. అతనిని గుర్తు పట్టడానికి ప్రయత్నిస్తూ.

"నేనెవరైందీ తర్వాత చెప్తాను కానీ, ముందు కారులోకి రండి మాస్టారూ" అతను కారు వెనుక సీటు తలుపు తీసి అన్నాడు.

ఆ మాట తీరు ఎప్పుడో, ఎక్కడో విన్న దిలాగే వుంది. అయినా అతనింకా గుర్తు రావటంలేదు.

"రండి మాస్టారూ" అతను బలవంతం చేశాడు. అతను అలా బలవంతం చేస్తూం డగా నా కెందుకనో అర్థంలేని వూహ ఒక టొచ్చింది. ఎక్కడో ఒక బ్యాంకు దగ్గర ఎవరో డబ్బు తీసుకు వెళ్తూ వుంటే, ఎవరో బలవంతం చేసి కారులో ఎక్కించుకు వెళ్లి ఆ డబ్బు కాజేశారని అమధ్య పత్రిక లలో వచ్చిన వార్త ఒకటి గుర్తొచ్చింది. ఇతనూ అటువంటి... నా వూహకు నాకే నవ్వొ చ్చింది. మానవులకు అనుమానం ఎక్కు వేమో. లేకపోతే దిక్కుమాలిన జీతంతో సంసార సాగరాన్ని ఈదలేక ఈదుతున్న బడిపంతుల్ని నేను. అలాంటి నా దగ్గర డబ్బు వుంటుం దని, కనీసం అనుమానించడానికైనా ఇతరు లకు అవకాశం ఎలా వుంటుందా అన్న ఆలో చన్నైనా నాకు రాలేదు. అతనెవ్వరో అంత

ఆప్యాయంగా పలకరిస్తూ వుంటే అతనిని అనుమానించాలన్న వూహ అసలు నాకెలా వచ్చిందా అని.

అతను తిరిగి బలవంతం చేయడంతో నా పిచ్చిపిచ్చి వూహలను కట్టిపెట్టి కారు వెనుక సీటులో కూర్చున్నాను. కారులో కూర్చోవడం నా జీవితంలో బహుశా అదే మొదటిసారి అనుకుంటాను. చాలా కొత్తగా వుంది. చేతిలో సరుకులతో వున్న సంచీని పదిలంగా ఒళ్లో పెట్టుకున్నాను. అతను నా వైపు చూచి, చిరునవ్వు నవ్వి, కారు తలుపు గట్టిగా వేసి, డ్రైవరు సీటులోకి వెళ్లాడు.

అతని వేపు ఓసారి చూశాను. అతను చాలా గంభీరంగా వున్నట్లుగా కన్పించాడు. కారు బయలుదేరింది. కొద్దిక్షణాలు గడిచిన తర్వాత అతను వెనక్కు తిరక్కుండానే అన్నాడు.

"మీరు చాలా పెద్దవారై పోయారు మాస్టారూ. ఆ గొంతులో ఏదో తెలియని మమకారం, ఆప్యాయత ధ్వనించింది. ఎందుకో గాని ఆ ఆప్యాయతకు తట్టుకోలేకపోయాను. అతను అలా ఆప్యాయంగా మాట్లాడడం కూడా నాకు ఒక రకంగా బాధగానే వుంది. అతన్ని గుర్తు పట్టలేకపోతున్నా. అతనన్న మాటకు నేనేమీ మాట్లాడలేదు.

"అమ్మగారు కులాసాగా వున్నారా? రామం ఏం చేస్తున్నాడు? కాత్యాయినికి పెళ్లి అయింది కదూ. వాళ్లెక్కడ వుంటు న్నారు?" అతను ప్రశ్నల వర్షం కురిపిం చాడు.

ఈ ప్రశ్న లన్నింటిలోకీ, 'అమ్మగారు' అనే మాట వినేసరికి నాకు ఒళ్లు ఝల్లు మనిపించింది. ఏదో గుర్తు కొచ్చినట్టే అనిపించి ఇట్టే మాయమయింది. అతనిని పరిశీలనగా చూడబోయాను, కాని అతను కనీసం పక్కకన్నా తిరగనందు వల్ల అతని మొహం నాకు కనిపించలేదు.

అతను అడిగిన ప్రశ్నలకు జవాబివ్వకే పోతే నొచ్చుకుంటాడని అన్నింటికీ సమా ధానాలు వివరంగా చెప్పాను.

"అయితే ఇక్కడ మీరు, అమ్మగారు మాత్రమే వుంటున్నారన్నమాట" నా సమా ధానాలు విని అతను అన్నాడు.

"అవున్నాయనా" అన్నాను.

తర్వాత అతనేమీ మాట్లాడలేదు. కారు వేగం హెచ్చింది. ఆ వూళ్లో గొప్ప వాళుడేం ధనవంతులు దాటి వూరికి చివరగా వున్న ఒక

పెద్ద మేడ దగ్గరకు కారు వెళ్లింది.. కారును చూడగానే గేటు దగ్గరి గూర్ఖా 'సెల్యూట్' చేసి గేటు తీశాడు. పూల మొక్కలు, క్రోటను మొక్కల మధ్యగా, మెల్లిగా వెళ్లి కారు పోర్టికోలో ఆగింది. కారు ఆగీ ఆగగానే ఇద్దరు నౌకర్లు పరుగెత్తుకుంటూ వచ్చి అతని ప్రక్కన తలుపు తీసి నిలబడ్డారు. అతను వచ్చి నాప్రక్క తలుపు తీసి

"రండి మాస్టారూ" అన్నాడు.

ఒక్కక్షణంలో నా అంతస్తు కొన్ని రెట్లు పెరిగినట్లయి కొంచెం సిగ్గు పడ్డాను.

"ఆ సంచీ ఇలా ఇవ్వండి" అని అతను నా చేతి సంచీ తీసుకుని ప్రక్కన వున్న నౌకరుకు అందించి, నా చేయి పట్టుకుని మెల్లిగా కారులోంచి దింపాడు.

"నేనింకా గుర్తుకు రాలేదు కదండి. నేను...నేను..లక్ష్మీపతిని."

'లక్ష్మీపతి' ఆ పేరు వినేసరికి నాకు ఆశ్చర్యం, నవ్వూ రెండూ వచ్చాయి. అతనిని ఈసారి బాగా పరిశీలనగా చూశాను. ఏవేవో ఆలోచనలు నా మెదడును అప్పుడే ఆక్రమించేశాయి.. లక్ష్మీపతి.. అని రెండుసార్లు కొంచెం బిగ్గరగానే అనుకున్నాను.

అతను మెల్లిగా నవ్వి, "రండి" అని హాల్లోకి దారి తీశాడు.

* * *

"నన్ను అందరూ మోసం చేశారు మాస్టారూ! నేనంటే జాలీ, దయ ఎవ్వరికీ లేవు. ప్రతీవారు నన్ను ఒక పురుగును చూచినట్లు చూచేవారు.. అందుకే చచ్చి పోదామనుకున్నాను. కానీ మీరు అందుకు కూడా వీలు లేకుండా చేశారు. మీకేం ద్రోహం చేశానని నన్ను బతికించారు మాస్టారూ" మాసి, చినిగి, వాసన గొడ్తున్న చొక్కాతో కళ్లనీళ్లు తుడుచుకుంటూన్న ఒక కుర్రవాడి విగ్రహం కళ్ల ముందు మెదిలింది. ఆ కుర్రవాడి పేరు కూడా లక్ష్మీపతే. 'లక్ష్మీపతి' అనే పేరు వినేసరికి నా మనస్సు నలభై సంవత్సరాల క్రిందకు పోయి ఆ కుర్రవాడిని గుర్తు చేసింది. అంత దీనావస్థలో వున్న ఆ కుర్రవాడి పేరు 'లక్ష్మీపతి' అని తెలుసుకునేసరికి నాకెందుకో నవ్వొచ్చింది. అప్పటినుంచీ 'లక్ష్మీపతి' అనే పేరు ఎప్పుడైనా వినడం తటస్థిస్తే నాకు నవ్వొస్తుండేది.

ఆ నాటి ఆ కుర్రవాడి విగ్రహం కన్నుల యెదుట స్పష్టంగా నిలిచింది. కుర్రవాడంటే అతను బొత్తిగా పసివాడు కాదు. అతనికి దాదాపు పద్దెనిమిది, పంతొమ్మిది సంవత్సరాలు వుండొచ్చు. లోతుకు పీక్కుపోయి గాజు గోళాల్లా వున్న కళ్లు, పొడుగాటి ముక్కు, తైల సంస్కారం లేక వాసన గొడ్తూ, అట్టలుగా వున్న జుట్టు, మాసి చినిగిపోయిన చొక్కా, అటువంటి దశలోనే వున్న నిక్కరూ—వీటన్నింటినీ జత గూర్చి ప్రాణం పోస్తే కదిలే విగ్రహమే ఆ కుర్రవాడు లక్ష్మీపతి.

"..ఇల్లూ, వాకిలీ, తల్లీ, తండ్రులూ— నా కెవరూ లేరు మాస్టారూ! నేను ఒంటరి గాణ్ణి.. అన్నీ సరిగ్గా వుంటే ఎందుకు చావాలనుకుంటాను?" బహుశా చాలారోజుల తర్వాత తొలిసారిగా నవ్విన పేలవమైన నవ్వులోంచి, నా ప్రశ్నలకు సమాధానంగా, ఆ కుర్రాడు జవాబిచ్చాడు.

నేను కూడా అతనిని అంతగా ప్రశ్నించలేదు. మనుష్యుల పేర్లు, పెరిగే కొద్దీ వాళ్లు తయారయ్యే తీరు ఈ రెండింటి మధ్య సర్వసాధారణంగా వుండే వ్యత్యాసాన్ని గమనిస్తూండే తత్వం నాది. అందుకనే అంతటి నిర్భాగ్య స్థితిలో వున్న అతని పేరు 'లక్ష్మీపతి' అని వినేసరికి నాకు నవ్వొచ్చింది. ప్రతివాడికీ పాతికేళ్లు వచ్చిన తర్వాత వాడి తరహా గమనించి, అందుకు తగ్గట్లుగా మరొకసారి 'నామకరణం' చేస్తే బాగుంటుందేమో? నా ఈ వూహ చాలామందికి నవ్వు కల్గించవచ్చు. అలా కలిగించింది కూడాను.

* * *

"రండి మాస్టారూ. ఏమిటి ఆలోచిస్తున్నారు?" అతను హాలులోకి ప్రవేశిస్తున్నప్పుడు నన్ను హెచ్చరించాడు. అతని హెచ్చరింపులో మళ్లీ ఈ లోకంలోకి వచ్చాను.

"అబ్బే..ఏంలేదు.. ఏంలేదు" సమాధానంగా అన్నాను. నా చేతిని పట్టుకుని అతను నన్ను జాగ్రత్తగా నడిపిస్తున్నాడు. ఆ హాలు నా కంటికి దేవేంద్ర భవనంలా కన్పించింది. విశాలంగా, చాలా కళాత్మకంగా రూపొందించబడిన ఆ హాలులో పెద్ద పెద్ద సోఫాలు, ముచ్చట గొలిపే ఖరీదైన చిన్న టేబుళ్లు, ఆ టేబుళ్ల మీద అందమైన డిజైన్లు గల 'క్లాత్'లు ఫ్లవర్‌వాజులలో పసివాడని రంగురంగుల పువ్వులు పొందికగా అమర్చి వున్నాయి. నేను చూచిన ఏ సినిమాలో కూడా అంతటి అందమైన హాలు దృశ్యంలేదు. ఎవరీ లక్ష్మీపతి?!.. సార్థక నామధేయుడిలా వున్నాడు. అతని వేపు ఓసారి చూచాను. అదే సమయంలో అతనూ నావేపు చూచి చిన్నగా నవ్వాడు.

హాల్లో పరిచి వున్న ఆ మెత్తటి తివాసీకి నా పాదాల దుమ్ము ఎక్కడ అంటుకుంటుందోనని అతి తేలికగా, జాగ్రత్తగా, అడుగులు వేస్తున్నాను. మళ్లీ నా మనస్సు గతంలోకి జారిపోయింది..

* * *

ఆ రోజు.. నాకు మరుపురాని రోజు.. ఆ రోజున కూడా చెప్పులు లేని పాదాలకు రైలు కట్ట వెంబడి వున్న రాళ్లు ఎక్కడ గుచ్చుకుంటాయోనని ఈ రోజులాగే అతి తేలికగా, జాగ్రత్తగా నడిచాను. ఆ నాటి వరకూ నా జీవితంలో చెప్పుకోదగినంత పెద్ద సంఘటనేమీ జరగలేదు. ఆ రోజు, ఆ సంఘటన తర్వాత మళ్లీ ఈ నాటి వరకూ ప్రత్యేకించి గుర్తుంచుకునే విశేషమేమీ జరుగలేదు కనుక ఆ రోజు, నాకు బాగా గుర్తుండిపోయింది.

ప్రతిరోజూ రైలు కట్ట వెంబడి కొంత దూరం 'షికారుగా' వెళ్లడం నా కప్పట్లో ఒక అలవాటుగా వుండేది. ఆ రోజూ అలాగే వెళ్లాను. అలా 'ఔటర్ సిగ్నల్' దాటి రెండు ఫర్లాంగులు నడిచి అక్కడ అనువుగా వుండే స్థలం చూచుకుని పొద్దుగూకిందాకా కూర్చున్నాను. రైతులు కొందరు అవిశాకు మోపులు కట్టుకుని వెళ్తున్నారు. దాదాపు ప్రతిరోజూ వాళ్లు అలా వెళ్లిన కొద్దీ సేపటికి నేను ఇంటి ముఖం పట్టడం అలవాటు. అయితే ఆ రోజు మాత్రం నేను మరికొంత సేపు అలాగే కూర్చుండిపోయాను. ఆ వూరు అంత పెద్ద 'టౌను' కాదు. అలాగని పల్లె కూడాకాదు. ఇంకా చీకటి పడితే వెళ్లడం కష్టమని బద్ధకంగానే లేచాను. మనస్సులోకి ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి, పోతున్నాయి.

ఉన్నట్టుండి నా పాదం ఒక కంకర రాయి గాఢంగా కౌగలించుకున్నంత పని చేశాయి. దెబ్బేమీ తగల్లేదు కాని, ఈ సారి ఇంకా జాగ్రత్తగా నడువసాగాను. నాకు ముందున్న 'సిగ్నల్' రైలును ఆహ్వానిస్తున్నట్లుగా వంగింది. అప్పటివరకూ తిరుగులేనట్లుగా, ధీమాగా వెలుగుతున్న ఎర్రదీపం, ఆకుపచ్చ దీపానికి చోటిచ్చి తాను తప్పుకుంది. ఒకసారి వెనక్కి తిరిగిచూచాను. సాయంత్రమే రావలసిన రైలేదో లేటుగా వస్తే తప్ప ఆ వేళప్పుడు బండ్లేమీ లేవు.

నాకు వెనుక కొంచెం దూరంలో ఎవరో వ్యక్తి కొంచెం వేగంగానే రైలు

కట్టవేపు వస్తున్నాడు. నేను మొదట అతనిని పట్టించుకో లేదు. ముందు జాగ్రత్త కోసం నేను రైలు కట్ట దిగి కొంచెం పక్కగా, మెల్లిగా నడుస్తున్నాను. అనుకోకుండానే నేను వో సారి వెనక్కు తిరిగి చూచాను. ఆసరికే అతను రైలు పట్టాల మధ్య నిల్చుని వున్నాడు. తర్వాత విశ్రాంతిగా అతను నిల్చున్న చోటనే కూర్చున్నాడు. అతని ప్రవర్తన కొంచెం వింతగా కన్పించడంతో నేను అతనికి సాధ్యమైనంత దగ్గరకు వెళ్లాలని మళ్లీ వెనక్కు తిరిగి వెళ్లాను.

దూరాన పొగ కనిపించింది. మిణుకు మిణుకు మనే వెల్తురు తనను తానే రైలు ఇంజనునని పరిచయం చేసుకుంది. రైలు పట్టాల మీద కూర్చుని ఉన్న వ్యక్తి ఈసారి ఒక పట్టాను తలగడగా చేసుకుని పడుకుని వున్నాడు. నా గుండె ఒక్కసారి కొట్టుకోవడం మానేసి కొద్ది క్షణాల తర్వాత తిరిగి పని చేసినట్టయింది. అతను..... అతను...... ఆత్మ.... హత్య.... ఆక్షణంలో నామెదడు అంతకు మించి పని చేయలేదు. రైలు శబ్దం రాను రాను దగ్గరగా విన్పిస్తోంది. నేను త్వరగా అతని వేపు పరుగెత్తాను. ఆ ప్రయత్నంలో నా కాలికి ఒక రాయి బలంగా కొట్టుకుంది. అతను మాత్రం అటువేపు తిరిగి విశ్రాంతగా, నిర్విచారంగా పడుకుని వున్నట్టుగా నాకు కన్పించాడు.

రైలు శబ్దం బాగా దగ్గరవుతోంది. నేను ఒక్క పరుగున అతనిని సమీపించడమూ — అతనితో సహా రైలు కట్ట కింద వున్న పొదమీద పడిపోవడమూ— రైలు మమ్మల్ని దాటి పోవడమూ— రెప్ప పాటులో జరిగి పోయాయి.

లక్ష్మీపతి

కొద్ది క్షణాల వరకు మేము ఆ పొద మీద అలానే వుండి పోయాము.... తర్వాత మెల్లగా లేచాను. చేతులు, మోచేతులు, కాళ్లు, అన్నీ బాగా గీరుకు పోయాయి. రాయి కొట్టుకున్న కాలివేలి నుండి రక్తం కారుతోంది. అతని వేపు చూచాను. అతను కూడా లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. అతనికి కూడా ఒళ్లంతా బాగా గీరుకు పోయింది. కొంచెం ముందుకు వంగి పరీక్షగా అతని మొహంలోకి చూచాను. అతను యువకుడే. ఆ చీకట్లో అంతకు మించి అతనిని నిశితంగా చూడలేక పోయాను. అతను లేస్తూ కొంచెం పెద్దగా మూలిగాడు. ఆ స్వరాన్ని నేను ఇంతకు ముందెప్పుడు వినలేదు.

అతన్ని మెల్లగా లేవ తీశాను. అతను ప్రతిఘటించ లేదు. లోతుకు పీక్కుపోయిన కళ్లతో అతను నన్ను ఒక్కమారు తీవ్రంగా చూశాడని మాత్రం చెప్పగలను. ఇద్దరమూ లేచి నిలబడ్డాము.

"నాతోరా...." అంతకు మించి నేను ఆ సమయంలో ఏమీ మాట్లాడలేదు. అతనూ మాట్లాడ లేదు. దారిలో అతని వైపు పరిశీలనగా చూచాను. అతనెవరో.... అతనికి నుదుటి మీద మాత్రం బాగా పెద్ద దెబ్బే తగిలింది. అగాయం మానిన తర్వాత అతని నుదుటి మీద— క్రాపు లోకి— మచ్చ ఏర్పడిపోయింది. — అతని పేరే లక్ష్మీపతి—

— ఆరోజున ఇంత సేపు జరిగిన సంఘటన ఈ రోజు నాకళ్ల ముందు కొన్ని క్షణాలలో కదిలి పోయింది.

"మాస్టారూ! ఏమిటి ఇందాకటి నుంచి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?... రండి.... ఈ సోఫాలో కూర్చోండి.... ఇప్పుడే వస్తాను." లక్ష్మీపతి చాలా తూచి తూచి మాట్లాడు తున్నాడా అనిపించింది. అతను తనను గురించి ఏమీ చెప్పడేమిటి?

సోఫాలో పడివున్న ఒక మేగజైను తీశాను. అందులో దీనంగా వున్న ఒక కుర్రవాడి బొమ్మ కనుపించింది. నాకు మళ్లీ లక్ష్మీపతి జ్ఞాపకం వచ్చాడు.

* * *

అందరికి లాగానే ఆ లక్ష్మీపతికీ వో కథ వుంది. ఆ రాత్రి మే మిద్దరమూ మా గాయాలకు ప్రథమ చికిత్సలాంటిది చేసుకుని, కాస్త ఎంగిలి పడి లేచాము. రోడ్లో మల్లె పందిరికి కాస్త ఎడంగా మంచాలు వేసుకుని పడుకున్నాం మే మిద్దరం. అతనిని ఎన్నో ప్రశ్నలు వేశాను. అతను మాత్రం కొన్నింటికి, కొన్ని జవాబులిచ్చాడు. అతని సమాధానాల తీరు గమనించిన మీదట అతనికి అభిమానం కొంచెం ఎక్కువగానే వున్నట్లు కన్పించింది.

కొడుకు ఎలాగైనా సంపాదించుకో గలడన్న వూహతో లక్ష్మీపతి తల్లి కూతురును ప్రేమగా చూచేది. తండ్రి ప్రేమ ఎలాంటిదో తెలియని లక్ష్మీపతికి తల్లి ప్రేమ అలా దూరమయింది. లక్ష్మీపతిని ఆదరణగా ఎవరూ చూడలేదు — ఆఖరికి అతని అక్కయ్య కూడా. తల్లి మరణించిన తర్వాత లక్ష్మీపతి దిక్కులేని వాడయ్యాడు. బావగా రింట్లో జీతం బత్తెం లేని నౌకరుగా వుండలేక అభిమానంతో, ఆశలతో ఇవతలికి వచ్చేసిన అతనిని ఎవరూ చేరదీయ లేదు. పని చేసిన కొన్ని చోట్ల అతనిని బాగా హింసించారు— అవమానించారు— లేని పోని దొంగతనాలు మోపారు— ఆఖరుకు అతనికి ఈ లోకంలో వుండడానికి— బతికేందుకు కాస్తంత జాగా అయినా కన్పించక ఆత్మ హత్య చేసుకోబోయాడు— ఇదీ ఆ కుర్రవాడి కథ. ఎన్నో ప్రశ్నలు వేస్తేనేగాని, అతని కథ నాకు తెలియ లేదు. ఈ కథలో 'నిజమెంత' అనే అనుమానాన్ని నాదగ్గరకు రానివ్వలేదు.

ఆ రోజు నుంచి అతను మాయింట్లోనే వున్నాడు. అలా వుండమన్నాను.

"బతక లేని వాళ్లు ఈలోకంలో

(46 వ పేజీ చూడండి)



పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం, (ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

3 నెలలు ఉచిత బహుమతి

అందమైన స్త్రీలకు మిక్కిలి నూతనమైన ఆకర్షణీయమైన డిజైనులలో రంగులలో సరిక్రొత్త కాశ్మీర్ ఆర్ట్ చీరెలు వచ్చివున్నవి. పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్-చీరె రు. 11/- 2 కి రు.20/- 3కి రు.28/- 4కు రు.36/- రెండు లేక అంతకు పై చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్సిల్ ద్వారా పంపబడును.
ARVIND AGENCIES (WAP-22)
P. B. 1408, Delhi-6.

ఇంగ్లీష్ టెరిలిన్



పాంట్ & షర్టులకు గుడ్డలు (1.25 & 2.15 మీటర్లు) రెండు కలిపి క్లియరెన్సు అమ్మకము రు. 25/- రెండు సెట్లు (2.50 & 4.30 మీటర్లు) రు. 48/- ఇంగ్లీష్ టెరిలిన్ సూటు పొడుగు (3 మీటర్లు) రు. 40/- వి.పి.పి. చార్జీలు రు. 2-50.
ARVIND AGENCIES (WAPT-25)
Box 1408, Delhi-6.

బొల్లి
ఉచిత ఔషధము
ఔషధము తినుకొన్నా 9 రోజులలో గుణమిచ్చును. సుపర్నిక ఖూతి-తెల్ల మచ్చలకు యిది మిక్కిలి ఉపయోగకరమైనది మరియు శక్తివంతమైనది. ఒక సీసా మందు ఉచితం.
PUBLICITY CORPORATION
(A.P.) P.O. Katrisarai, (Gaya) India.

లక్ష్మీపతి

(12 వ పేజీ తరువాయి)

ఎందరో వున్నారు లక్ష్మీపతీ! మరి ఆత్మ హత్యలే సమస్యలకు పరిష్కారాలయ్యేట్లయితే వాళ్ళందరూ ఏం కావాలి కనుక."

"నువ్వు ఇక్కడే, మా యింట్లోనే వుండిపో" అనేటప్పుడు అతనికి ఇలా చెప్పాను. ఆరోజు నుంచి లక్ష్మీపతికి కాస్త చదువు కూడా చెప్పడం ప్రారంభించాను.

లక్ష్మీపతి పూర్తిగా మారిపోయాడు గానీ, అతని నుదుటి మీది మచ్చ మాత్రం గతానికి స్మారకచిహ్నంలా అలాగే వుండిపోయింది. అలా రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. అకస్మాత్తుగా వోనాడు లక్ష్మీపతి మాయ మయ్యాడు. అతని కోసం ఎంతగానో వెతికించాను. లాభం లేక పోయింది. కొంతకాలం గడిచిన తర్వాత ఎవరో, ఎక్కడో రైలుకింద పడి ఆత్మ హత్య చేసుకున్నాడని తెలిసింది. అతను లక్ష్మీపతేనా? కాదేమో అనుకున్నాను. అతనికి ఇప్పుడు ఆత్మహత్య చేసుకోవలసినంత 'అన్యాయం' ఏం జరిగింది కనుక? —ఆ తర్వాత లక్ష్మీపతిని గురించి మర్చిపోయాను. అతని పేరు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నాకు ఎందుకనో నవ్వొచ్చేది... కళ్ళ ముందు గతం కరిగి పోవడంతో చేతిలో మాగజైను జారిపోయింది.

* * *

"ఇక ఆలోచనలన్నీ మానేసి ముందు ఈ టిఫిన్ తీసుకోండి" లక్ష్మీపతి స్వయంగా బిస్కెట్ల పళ్ళెంతో వస్తూ అన్నాడు. లక్ష్మీపతిని పరిశీలనగా చూచాను. ఈ సారి అతని తల మీద టోపీ లేదు. నా దృష్టి అతని నుదుటి మీది మచ్చ మీద పడేసరికి ఉలిక్కి పడ్డాను. సరిగ్గా అదే మచ్చ. ఆ మచ్చ కూడా అలానే వుండేది.... అయితే........

"లక్ష్మీపతీ..... ల....క్ష్మి.... ప...తీ.... నువ్వేనా..... నువ్వు.. బతికే.... వున్నావా..." సంతోషం పట్టలేక పెద్దగా అరవబోయాను కాని, గొంతులోంచి మాటలు సరిగ్గా రాలేదు. అతను చేతిలో పళ్ళేన్ని బల్లమీద పెట్టి నా పాదాల దగ్గర కూర్చుని,

"నన్ను క్షమించండి మాస్టారూ!... మీ మనస్సుకు కష్టం కలిగించాను. అంత ఆదరంతో నన్ను చూచినా కాని, మీకో చెప్పకుండా పారి పోయాను. నన్ను క్షమించండి" అతని రెండు చేతులు నా పాదాల మీద పెట్టి అన్నాడు. అతని కనుకొలకుల్లో రెండు కన్నీటి బిందువులు నిలిచి వున్నాయి.

"తప్పు నాయనా.... లక్ష్మీపతీ.... లక్ష్మీపతీ"— నా మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోతుంది. నేను చేరదీసిన లక్ష్మీపతి...... నా లక్ష్మీపతి బతికేవున్నాడు. నా కన్నీరు అతని తల మీద పడుతోంది. అతని కన్నీరు నా కాళ్ళను కడిగివేసేట్లుగా వుంది.

అతన్ని లేవ తీశాను. అతను మౌనంగా నా ప్రక్కనే కూర్చున్నాడు. అలా కొన్ని క్షణాలు గడిచి పోయాయి. మే మిద్దరమూ ఈ లోకంలో లేము. కొంత సేపటికి అతను అన్నాడు...

"ముందు ఈ టిఫిన్ తీసుకోండి మాస్టారూ"— ఆనందం, సంతోషం కన్నా ఆ బిస్కట్లు రుచిగా లేవు. తర్వాత అతను వోవల్టిన్— స్వయంగా— తెచ్చాడు. తాగాను.

"నువ్వు 'అమ్మగారు' అన్నప్పుడే అనుమానించాను. కానీ, నువ్వు బతికే వున్నావని మాత్రం వూహించ...... " ఆపైన నాకు మాటలు రాలేదు.

అతను నవ్వాడు. ఆ నవ్వు చాలా హాయిగా వుంది.

"చనిపోయేవాడిని నన్ను బతికించారు. అప్పుడు అను కున్నాను. మీరు కూడా అందరిలాగే నన్ను మోసం చేశారని... మీ ఆదరణలో ఆవేశాన్ని కొంత వరకే మర్చిపో గలిగాను. నాకు లోకం మీద అప్పుడు చాలా అసహ్యంగా వుండేది. బాగా ఆలోచిస్తే ఇప్పుడూ కూడా అలానే వుందను కుంటాను కాని, నేను, నాలాంటి వాళ్ళూ మీలాంటి వాళ్ళండ బట్టే....."

అతని మాటలను సగంలోనే ఆపి అన్నాను.

"లక్ష్మీపతీ— ఏం మాటలు అవి... అంతటికీ ఆ పరమాత్ముడే కారకుడు నాయనా......"

లక్ష్మీపతి మళ్ళీ ప్రారంభించాడు:—
"మాస్టారూ ఈ కలియుగంలో మీలాంటి వారి రూపంలోనే దేవుడు వుంటాడని నా నమ్మకం....." తర్వాత

అతను దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు "మీ నుండి పారి పోయిన తర్వాత నేను ఎంత హీనంగా బ్రతకాలో— అంత హీనంగానూ బ్రతికాను. కాని ఆత్మహత్య చేసుకో దల్చుకో లేదు. ఒక ప్రదేశమని లేదు. ఒక ప్రాంతమని లేదు. ఇష్టం వచ్చినట్లుగా తిరిగాను. కొన్నేళ్ల తర్వాత ఒక మారు మూల ప్రాంతంలో ఒకరి ఆశ్రయంలో వుండి పోయాను. అలా కొన్నేళ్లు గడిచి పోయాయి."

"ఒకనాటి ఉదయం నేను నిద్ర లేచి చూచేసరికి నాచుట్టూ దాదాపు ఇరవై మంది నిల్చొని వున్నారు. అందరి కన్నా ముందు మా యజమాని నవ్వుతూ నిల్చుని వున్నాడు. నాకు అయోమయ మయింది. తర్వాత ఆయన చెప్పారు. నన్ను లక్ష్మి వరించిందని.... ఆయన ఒకనాడు ఇంట్లో అందరి చేతా లాటరీ టిక్కెట్లు కొని పించాడు. ఆ సమ యంలో నేనూ అక్కడే వున్నాను. ఆయన నన్నూ బలవంతం చేసి నా జీతంలో ఒక రూపాయి ముందుగానే అప్పుగా ఇచ్చి నాచేత ఆ టిక్కెట్టు కొనిపించాడు. ఆ లాటరీలో నాకు లక్ష.... లక్ష రూపా యలు వచ్చాయి మాస్టారూ—" అతనికి చిరు చెమటలు పోశాయి. కోటు జేబు లోంచి 'కర్చీఫ్' తీసి తుడుచుకుంటూ చెప్పాడు.

"నా డబ్బును ఆయన వ్యాపారంలో పెట్టాడు. నేను వ్యతిరేకించ లేదు. ఎందు కంటే ఆ లక్ష రూపాయలను నేను కష్టించి సంపాదించ లేదు. వ్యాపారంలో విపరీతంగా లాభాలు వచ్చాయి. ఆయన కొంత తీసుకొని నాకు కొంత ఇచ్చాడు. అలా ఆ డబ్బు పెరిగి పోవడం ప్రారం భించింది. నాకు ఎందుకో ఆ డబ్బుతో పాటు భయం కూడా పెరగ సాగింది. అందుకే ఓ రోజు నా యజమానితో ఇక నాకు డబ్బు అక్కర్లేదు. ఇప్పటి వరకూ వచ్చింది చాలన్నాను. అందు కాయన నవ్వాడు— ఫర్వాలేదులే అన్నాడు. నేను విన లేదు. నేను నా డబ్బు తీసు కొని ఆయన దగ్గర సెలవు తీసుకొని వచ్చేశాను."

లక్ష్మీపతి తన కథను ముగించాడు. చేతి రుమాలుతో మొహాన పట్టిన చెమ టను గట్టిగా తుడుచుకుని నావేపు చూచాడు.

ఈ మారు లక్ష్మీపతి నాకు చాలా కొత్తగా కనుపించాడు. 'డబ్బు వద్దు'— అనుకునే మనుష్యులు కాని,— 'ఈ డబ్బు చాలు'— అనుకునే వాళ్లు కాని నాకు ఈ నాటికి కన్పించ లేదు.— ఒక్క లక్ష్మీపతి తప్ప. లక్ష్మీపతి డబ్బును, లాభంలో అతని వాటాలను అంత న్యాయంగా, సక్రమంగా ఇచ్చి వేసిన అతని యజమాని లాంటి వాళ్లు కూడా చాలా అరుదు.

లక్ష్మీపతిని ఒక ప్రశ్న అడుగుదామా వద్దా అని చాలా సేపు తటపటాయించాను అతను నా అవస్థ గమనించాడులా వుంది "ఏమిటి మాస్టారూ" అన్నాడు. 'ఏం లేదు' అందామను కున్నాను కానీ అలా అనలేక పోయాను. కొంత సేపైన తర్వాత అన్నాను:

"లక్షలను కోట్లు చేసుకో వలసిన వాడివి నీకు డబ్బంటే అంత విరక్తి ఎందుకయ్యా"

నా ఈ ప్రశ్నలో అతనికి పెళ్ల యిందో లేదో నన్న భావం వ్యక్తమయ్యే వుంటుంది— లక్ష్మీపతికి.

నా ప్రశ్నకు లక్ష్మీపతి నవ్వి అన్నారు: "ఓ సారి ఇలా రండి మాస్టారూ—" అతను నన్ను ఓ పెద్ద బీరువా దగ్గరకు తీసుకు వెళ్లాడు. అతను బీరువా తలుపు తీశాడు. ఆ బీరువాలో అరలన్నీ ఖాళీగా వున్నాయి— ఒక్కటి తప్ప. ఆ ఒక్క అరలో మాసిపోయిన చొక్కా, అలాంటిదే ఒక నిక్కరు మాత్రం వున్నాయి. అలాంటి గుడ్డలను ఎవరూ దాచుకోరు— పైగా అలాంటి బీరువాలో—. ఆ గుడ్డలను చూచిన మీదట నాకు నోటి మాట రాలేదు.

"మాస్టారూ వీటితో నేను యజ మాని దగ్గర పనిచేసే వాడిని. అంటే బ్రతికే వాడిని. నేను బ్రతకాలంటే నాకు ఆ జీవితం చాలు. అయితే విధి నన్ను మరొక విధంగా చూచింది. అందుకనే ఆ ఆశ్రమం, ఆ దశ తొలగి ఐశ్వర్య వంతుణ్నయ్యాను. ఈ డబ్బుతో నేను నాజీవితాంతం వరకూ సుఖంగా, హాయిగా, దర్జాగా బ్రతక గలను. ఇంకా ఈ డబ్బును ఇలా పెరగ నివ్వడ మెందుకు చెప్పండి?" లక్ష్మీపతి సమాధానం నన్ను నిరుత్తరుణ్ని చేసింది. మరేమీ మాట్లాడ లేక వెనక్కు తిరిగాను.

లక్ష్మీపతి బీరువా తలుపు వేసి నా వెనకగా వస్తూ అన్నాడు.

"మాస్టారూ! నాకు ఒక్క కోరిక వుంది తీరుస్తారూ—"

అతని కంఠం మారి పోయింది. ఆశ్చర్య పోతూ వెనక్కు తిరిగి లక్ష్మీపతి వేపు చూచాను. ఈ మారు లక్ష్మీపతిలో గూడు కట్టుకునివున్న వృద్ధాప్యం బహిర్గత మైంది. ఇంత సేపటి నుండీ లక్ష్మీ పతిలో ఆ మార్పు నాకు కనిపించలేదు.

"ఏమిటి లక్ష్మీపతి— నావల్ల నీకు కోరిక తీరడమా—" ప్రశ్నార్థకంగా అతని వేపు చూస్తుండి పోయాను.

"అవును మాస్టారూ— తప్పక తీరుస్తారు కదూ—"

"తప్పక— నాచేతనైతే— తప్పక తీరుస్తాను".

నా సమాధానంతో లక్ష్మీపతి మొహంలో కోటి దీపాలు ఒక్క సారిగా వెలిగి నట్లైంది.

"నాకు తెలుసు మాస్టారూ— నా ఈ కోర్కెను మీ రొక్కరే తీర్చగలరు— అందుకనే నేను ఇంత దూరం ఇక్కడికి వచ్చి ఇన్నాళ్లుగా మీ కోసం ఈ ప్రాంతా లలో వాకబు చేశాను. నాకున్న కోర్కె ఇదొక్కటే— అదే— మీరు సకుటుం బంగా వచ్చేసి నాతో— ఇక్కడే వుండి పొండి— నాకు 'నా' అనే వాళ్లెవరూ లేరు..... నాజీవితంలో.... ఈ దశలో అలాంటి బంధాలు కలిగించుకోవాలన్న ఆసక్తి లేదు. నా జీవితంలో ఏర్పడిన ఈ మార్పుకు, తిరిగిన ఈ మలుపుకు మూల కారకులు మీరే. కాబట్టి మీరే ఈ మలుపునకు నిజమైన వారసులు..." లక్ష్మీపతి మాటలు ఆ తర్వాత నాకు వినిపించలేదు.